క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సింహగిరి కాలనీ కొండవాలు దిగువున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఇటీవల ఆధునీకరించారు. ఈ పనులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆంజనేయస్వామిని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ముఖ్యఅతిథులుగా విజయమోహన్, గోవింద్, కమిటీ సభ్యులు ఈశ్వరరావు, ఎర్రయ్య, త్రినాథ్, భక్తులు స్వామికి పూజలు చేశారు.

క్రీడాకారులకు ఎంపీ ఎంవీవీ చేయూత



క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలేనికి చెందిన ఎస్‌కేఎంఎల్ బాయ్స్‌లో క్రీడాకారులకు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆర్థిక సహాయం అందించారు. వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం విచ్చేసిన ఎంవీవీని స్థానిక ఎస్‌కేఎంఎల్ బాయ్స్ క్రీడాకారులు తమ ప్రోత్సహించాలని కోరగా.. అక్కడికక్కడే తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. లక్ష్యంతో క్రీడల్లో రాణించాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు నాయకులు అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న మొక్కలకు అంటు కట్టడడంపై శిక్షణ



మాట్లాడుతున్న గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : కూరగాయలు, మొక్కలకు అంటు కట్టే ప్రక్రియపై ఈ నెల 25న సింహాచలం గోశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్టు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి దాట్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. శివాజీపాలెంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు లేకుండానే ఇంటి వద్ద పంట సాగు ఎలా చేసుకోవాలనేది వివరిస్తామన్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారు తమ వివరాలను వాట్సప్ నంబర్లు 9866138129, 9966651052లలో తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపకుడు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయం ప్రారంభం



గణేశ్వర పాఠశాలలో కార్యాలయం ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ

జగదాంబ: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో తర్ఫీదు పొందడం వల్ల విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ దరి గణేష్ పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త కార్యాలయానికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రకాశరావు, కార్యదర్శి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం.. బీసీ స్టడీ సర్కిల్

- పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో శిక్షణ తరగతుల పునఃప్రారంభం



స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులు



అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తున్న డైరెక్టర్

ఎంవీపీ కాలనీ: నిరుద్యోగుల పాలిట వరంగా మారింది ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర నిరుద్యోగులకు ఈ కేంద్రం వెలుగులు పంచుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిల్లో జరిగే పలు పోటీ పరీక్షలకు అర్హులైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. నిష్ణాతులైన అధ్యాపకుల శిక్షణలో వందలాది మంది నిరుద్యోగులు తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. 2014 నుంచి టీడీపీ హయాంలో ఈ స్టడీ సర్కిల్ సేవలు క్రమంగా నిలిచిపోవడంతో ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరుస శిక్షణలకు అనుమతులు ఇవ్వడంతో బీసీ స్టడీ సర్కిల్‌కు కొత్త జోష్ వచ్చింది.

గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు శిక్షణ

ప్రస్తుతం ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–2 పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న 70 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. 50 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయి. అన్ని సబ్జెక్టుల్లో నిష్ణాతులైన నిపుణులతో అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నారు. గ్రూప్స్‌తో పాటు బ్యాంక్ క్లర్క్, ఎస్‌ఐ, కానిస్టేబుల్, సివిల్ జడ్జి వంటి పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను స్టడీ సర్కిల్‌లోని లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ప్రస్తుతం గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు రూ.1500 స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కోసం మరో రూ.1000 ప్రభుత్వం తరఫున అందజేయనున్నారు.

నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా..



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల అభ్యున్నతే లక్ష్యంగా సర్దార్ గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సేవలు అందిస్తున్నాం. గ్రూప్–2, 3, 4లతో పాటు బ్యాంక్స్, దేవదాయ శాఖ ఈవో, తదితర పలు ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాం. నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌కు నిధులు, స్టైఫండ్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.శ్రీదేవి, డైరెక్టర్, గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్

విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



పూజలందుకున్న విజయదుర్గాదేవి



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఆరిలోవ: హనుమంతవాక వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని విజయదుర్గా కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22 వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడ విజయదుర్గాదేవిని వివిధ రకాల పూలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజలు చేశారు. అనంతరం పెదగదిలిలోని పోలమాంబ గుడి నుంచి 108 కలశాలతో మహిళలు విజయదుర్గా కాలనీ వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా విజయదుర్గాకాలనీ, హనుమంతవాక, సింహగిరి కాలనీ, పెదగదిలి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన



రామకృష్ణాపురంలో పంపిణీ చేసిన మొక్కలతో మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో మహిళల ఆరోగ్య సమస్యలపై ఉత్కర్ష గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రతి నెలా మహిళలు ఎదుర్కొంటున్న నెలసరి, గైనిక్ సమస్యలు, వాటి నివారణకు ఏవిధంగా జాగ్రత్తలు పాటించాలో వివరించారు. మహిళలకు పలు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. వాటిని ఇళ్ల వద్ద నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ వసీం, ఏఎన్‌ఎం లక్ష్మి, గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు, కాకర గోవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ

విశాఖ లీగల్: ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని విశాఖ జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ కోరారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జిల్లా కోర్టులోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయ ఫలాలకు దూరం కాకూడదన్నారు. సీనియర్ న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ అవసరమైన సేవలను ఇంటి వద్దకే అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి ఎంఎస్ శోభారాణి, పరిపాలన అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ శర్మ, అధికారులు ఆంజనేయులు, ఎస్.చిన్నారావు, శ్యామల, సహాయ సంక్షేమ అధికారి పూర్ణిమ దేవితో పాటు అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లా అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ఏడుగురికి పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొందారు. పదోన్న తులు పొందిన వారికి జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తన క్యాంపు కార్యాలయంలో మంగళవా రం పోస్టింగ్ నియామక ఉత్తర్వులు అందజేశా రు. ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఏడుగురికి రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని సుభద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, పరిపాలన విభాగం సెక్షన్ ఆఫీసర్ మంజులవాణి, కార్యాలయ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



17 వార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17, 19వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శ్రీకారం చుట్టారు. ఎంపీ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తొలుత 19వ వార్డు జాలరిపేటలో రూ.109.85 లక్షలతో మత్స్యకారుల కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించనున్నారు. ఆయా పనులకు ఎంపీ ఎంవీవీ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జాలరిపేటలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, పరసన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రూ.25 లక్షలతో 17వ వార్డులో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ఎంపీ ఎంవీవీ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దేందుకు, విద్యార్థుల్లో మంచి ప్రవర్తన, నడవడిక, పెద్దలపై విధేయత కలిగి ఉండేందుకు మంచి పుస్తకాలు, రచనలు అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ బాల్యం విభాగంలో విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్ ఆవుపాటి రచించిన ఎన్స్యూరింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఎర్లీ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని మంగళవారం మేయర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి నడవడిక కల్గి ఉండే రచనలు, పుస్తకాలు అవసరమన్నారు. ఈ పుస్తకం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ సెంటర్ నెంబర్ (ఐఎస్‌బీఎన్)పొందడంతో పాటు పెన్స్ ఆఫ్ హానర్ అవార్డు దక్కించుకుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా మరిన్ని రచనలు చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్‌ను మేయర్ అభినందించారు.

కృష్ణా కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిజికల్ కెమికల్, బయోలాజికల్ సైన్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో మిస్సో పోరస్ పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, ఏయూ విశ్రాంత వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 22న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో తెలిపారు.

విద్యుత్ సేవలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ 33/11 కేవీ హనుమంతక ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పెదగదిలి, చినగదిలి, సాలిపేట, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం, ఎస్సీ కాలనీ, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

– హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌లు నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలను మార్చుతున్నారు. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా ఈ ప్రాంతానికి సంబంధించిన విమ్స్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధి 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. దీంతో బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూకాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువజన విభాగం కార్యదర్శికి అభినందన

ఎంవీపీ కాలనీ: ఇటీవల విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన యనమరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. ఈ మేరకు రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఎంపీ ఎంవీవీని లాసన్స్ బే కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ ఆయన్ను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కార్పొరేటర్ ముమ్మల లక్ష్మి, ముమ్మల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

23న ఇంద్రజాలికుల దినోత్సవం

మద్దిలపాలెం : ఈ నెల 23న ఇంద్రజాలికుల దినోత్సవాన్ని విశాఖ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ ఇంద్రజాలికుడు పద్మశ్రీ పి.సి.సర్కార్ జయంతిని పురస్కరించుకుని జరిగే ఈ వేడుకల్లో గోపాలపట్నానికి చెందిన సీనియర్ ఇంద్రజాలికుడు ఎస్.కె.అన్వర్‌బాషా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 15వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



సింహాద్రిపురంలో పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : పేదల జీవితాల్లో సంక్షేమ పథకాలు వెలుగులు నింపాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 15వ వార్డులో కొండవాలు ప్రాంతమైన కొత్త వెంకోజీపాలెం, సింహాద్రిపురంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి ఎంపీ పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఎంత మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వార్డులో చేసిన అభివృద్ధి పనులకు వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రతి పేదవాడికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, వెంకటలక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కన్వీనర్ రూపవతి

విశాఖ విద్య: విద్యార్థులు చదువులతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ ఎస్. రూపవతి అన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమీ, రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించిన శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు నాలుగు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్‌తో పాటు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ ఉపాధ్యాయుడు పి. సుధాకర్, ప్రిన్సిపాల్ రత్నవల్లిని ప్రత్యేకంగా అభినందించారు.

సమాచారమ్

మానసిక ఆరోగ్యం ప్రధానం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో ప్రధానమైనది సైకాలజిస్ట్ మౌని కారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులకు ఆదిత్యబిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎంపవర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మానసిక ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తుల ఆలోచనలు, ఉద్రేకాలు, ప్రవర్తన, వైఖరులు, మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన వల్ల ప్రజలు తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా తెలుసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపవర్ కార్యక్రమ స్టేట్ కోఆర్డినేటర్ బి.సుధాకరరావు మాట్లాడుతూ ఒత్తిడిని తట్టుకుని మాట్లాడడం, అధిగమించే విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత ఎదుర్కొనే మానసిక సమస్యలకు తగిన పరిష్కారాలు చూపడం, మార్గనిర్దేశం చేయడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రోగ్రాం అధికారులకు ఎంపవర్ కార్యక్రమ నిర్వాహకులు శిక్షణ సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం పక్కన కొత్తగా అభివృద్ధి చేసిన షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. కార్యాలయం సిబ్బంది తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంపై వీసీ సంతోషం వ్యక్తం చేశారు. వర్సిటీలో మరిన్ని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యతో సమానంగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, క్రీడా విభాగాధిపతి ఆచార్య పల్లవి, సంచాలకుడు ఆచార్య ఎస్.విజయమోహన్, డీన్ ఆచార్య జి.వీర్రాజు, ప్రిన్సిపాల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ‘ఇగ్నో’ వార్షికోత్సవం



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తున్న ఆచార్య సూర్యప్రకాశరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం 37వ వార్షికోత్సవం జైల్ రోడ్డు దరి విశాఖ వుమన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇగ్నో ద్వారా ఉన్నత చదువు అభ్యసించిన విద్యార్థులకు ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావుతో కలిసి ముఖ్యఅతిథిగా దామోదర్ సంజీవయ్య న్యాయ కళాశాల వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సమాజానికి విద్య ఎంతో అవసరమన్నారు. విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు నేటి ఆధునిక సమాజానికి అనుగుణంగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.